ప్రజాశక్తి
సోమవారం 1 మే 2023 5 విజయనగరం



పోస్టల్ సంఘాల గుర్తింపును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అర్థం పర్థం లేని కారణాలతో రెండు పోస్టల్ ఉద్యోగ సంఘాలకు కేంద్ర ప్రభుత్వం గుర్తింపును రద్దు చేయడం అప్రజాస్వామికమని అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం (ఎఐఐఇఎ) విశాఖపట్నం డివిజన్ అధ్యక్షులు ఎం.కామేశ్వరి, ప్రధాన కార్యదర్శి జి.వరప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆలిండియా పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఎఐపిఇయు), నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ (ఎన్ఎఫ్‌పిఇ) సంఘాలకు పోస్టల్ శాఖలో 70 శాతం పైన సభ్యుల బలం ఉందని, వాటి గుర్తింపును 5 శాతం బలం కూడా లేని ఓ సంఘం ఫిర్యాదుపై గుర్తింపును రద్దు చేయడం ఏమాత్రం సమర్థనీయం కాదని అన్నారు. సంఘీభావం, సౌభ్రాతృత్వం భారత రాజ్యాంగపు మౌలిక లక్షణాలని వారు అన్నారు. ఈ దృష్టితో జీవిత బీమా సంస్థలో 80శాతం పైగా సభ్యత్వం ఉన్న ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఎఐఐఇఎ) సోదర పోస్టల్ సంఘాల గుర్తింపు రద్దును వ్యతిరేకిస్తోందని తెలిపారు. ఈనిర్ణయాన్ని పునః పరిశీలించి సంఘాల గుర్తింపును పునరుద్ధరించాలని వారు కోరారు.



పిచ్చిమొక్కలతో పూడికపోయిన మడ్డువలస కాలువ

ప్రతిపాదనలకే పరిమితం

- అధ్వానంగా మడ్డువలస సాగునీటి కాలువలు
- కుడి, ఎడమ కాలువల్లో పేరుకుపోతున్న పూడికలు
- సాగునీరందక రైతులకు ఏటా తప్పని కష్టాలు
- వేసవిలోనే పూడికతీత పనులు చేపట్టాలని రైతుల డిమాండ్

ప్రజాశక్తి- వంగర

కొన్నివేల ఎకరాలకు సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో 20 ఏళ్ల క్రితం మడ్డువలస ప్రాజెక్టును నిర్మించారు. ఇప్పుడా ప్రాజెక్టు నుంచి సాగునీరందించే కుడి, ఎడమ కాలువలు అధ్వాన్నంగా ఉన్నాయి. పూడికలు పేరుకుపోయి, చెత్త చెదారంతో, పిచ్చి మొక్కలతో నిండి కాలువలు రూపు కోల్పోయి దైనీయ స్థితిలో ఉన్నాయి. వ్యవసాయ సీజన్‌లో ఆయకట్టు రైతులకు సాగునీరు సక్రమంగా అందక అనేక ఇబ్బందులు పడుతున్నారు.

గొర్లె శ్రీరాములు నాయుడు మడ్డువలస ప్రాజెక్టుకు కుడి, ఎడమ రెండు ప్రధాన కాలువలు ఉన్నాయి. కుడి ప్రధాన కాలువ ద్వారా ఫేస్- 1లో రేగిడి, సంతకవిటి మండలాలతోపాటు శ్రీకాకుళం జిల్లాలో గల పొందూరు, జి.సిగడాం మండలాలకు 50 కిలోమీటర్ల పరిధిలో 24 వేల ఎకరాలకు నీరందించాలి. ఎడమ కాలువ ద్వారా వంగర మండలంలో గల మగ్గూరు, అగ్రహారం, సంగాం గ్రామాలలో గల భూములకు సాగునీరు అందించవలసి ఉంది. అయితే ఎన్నో ఏళ్ల క్రితం చేపట్టిన ఈ మట్టి కాలువలు ప్రస్తుతం అధ్వానంగా ఉన్నాయి. పూడికలు పేరుకుపోవడంతో పిచ్చి మొక్కలతో నిండి రూపు కోల్పోయిన పరిస్థితి ఉంది. దీంతో సకాలంలో సాగునీరందక రైతులు వ్యవసాయ సీజన్‌లో ఇబ్బందులు పడుతున్నారు.

పనులు చేపట్టేందుకు అనుకూల సమయం

సాగునీటి కుడి, ఎడమ కాలువల్లో పేరుకుపోయిన పూడికలు, చెత్తాచెదారాలు, పిచ్చి మొక్కలు తొలగించేందుకు ఈ వేసవిలో పనులు చేపడితే ఎంతో అనుకూలంగా ఉపయోగకరంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. ప్రాజెక్టు ప్రధాన గేట్లు మరమ్మత్తులు చేపట్టేందుకు అధికారులు ప్రాజెక్టులో ఉన్న నీటినంతటని నాగావళి నదిలోకి విడిచి పెడుతున్నారు. అందువల్ల కుడి, ఎడమ కాలువలోకి నీరు వెళ్లకుండా నిలిపివేశారు. దీంతో కాలువల్లో నీరు ఎండిపోయి ఉంది. ఇలాంటి సమయంలో కాలువలు మరమ్మతు పనులు సులువుగా చేయవచ్చునని, వ్యవసాయ సీజన్‌లో పనులు చేపడితే ఉపయోగం ఉండదని రైతులు భావిస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

వ్యవసాయ సీజన్‌లో ఆయకట్టు రైతులకు సాగునీరు సక్రమంగా అందక అనేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఉంది. ప్రాజెక్టు ఎడమ కాలువకు అతి సమీపంలో ఉన్న మండలంలోని ఓని అగ్రహారం, సంగాం గ్రామాలకు చెందిన రైతులకు సాగునీరు సక్రంగా అందటం లేదంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ విషయాన్ని పలుమార్లు ఆయా గ్రామాల రైతులు అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి సాగునీటి ప్రధాన కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాలను, పూడికలను, పిచ్చి మొక్కలను తొలగించి పిల్ల కాలువలను ఏర్పాటు చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

నిధులు మంజూరే ఆలస్యం

మడ్డువలస కుడి, ఎడమ ప్రధాన కాలువల్లో పేరుకుపోయిన పూడికలు తొలగించి మరమ్మత్తులు చేసేందుకు నిధులు మంజూరుకు ప్రతిపాదన పంపించాం. నిధులు రావడమే ఆలస్యం. వచ్చిన వెంటనే పనులు చేపడతాం.

- నర్మదా పట్నాయక్ డిఇ, మడ్డువలస ప్రాజెక్టు

6 ఎకరాల్లో ఫ్లోటింగ్ జెట్టీ

రూ.23.73 కోట్లు ఖర్చుతో ఫిష్‌ల్యాండింగ్ సెంటర్ ఏర్పాటు

3న పనులు ప్రారంభించనున్న సిఎం జగన్మోహన్‌రెడ్డి



జెట్టీ నిర్మించనున్న చింతపల్లి తీరం

ప్రజాశక్తి- విజయనగరం

మత్స్యకారుల జీవన భృతికి భరోసా కల్పించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. పూసపాటిరేగ మండలంలోని చింతపల్లి సముద్ర తీరం వద్ద ఫిష్ ల్యాండింగ్ సెంటర్ (ఫ్లోటింగ్ జెట్టీ)ని నిర్మించాలని ప్రభుత్వ నిర్ణయించింది. దీనికోసం ఇప్పటికే ఆరు ఎకరాల స్థలాన్ని గుర్తించారు. చింతపల్లితోపాటు చుట్టుప్రక్కల ప్రాంతంలోని తిప్పలవలస, మద్దూరు, కొత్తూరు, బర్రిపేట, నీలగెడ్డపేట, తమ్మయ్యపాలెం, పులిగెడ్డపాలెం, పతివాడ బర్రిపేట తదితర చోట్ల 16 ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు ఉన్నాయి. వీటిలో అతిపెద్దదైన చింతపల్లి వద్ద ఈ ఫ్లోటింగ్ జెట్టీని నిర్మించాలని నిర్ణయించారు. దీనికి సుమారుగా రూ.23.73కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ఈ ఫిష్ ల్యాండింగ్ సెంటర్ పనులను, మే 3న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి ప్రారంభిస్తారు. ఈ జెట్టీ నిర్మాణం పూర్తయితే మత్స్యకారుల జీవన ప్రమాణాలు పెరగడమే కాకుండా, నాణ్యమైన మత్స్య ఉత్పత్తులు జిల్లా ప్రజలకు అందుబాటు లోకి వస్తాయి. పర్యాటక పరంగా కూడా చింతపల్లి ప్రాంతం అభివద్ది చెందుతుంది.

4 వేల మత్స్యకార కుటుంబాలకు మేలు

జిల్లాలో సుమారు 21.44 కిలోమీటర్ల మేర సముద్ర తీరం ఉంది. చింతపల్లి వద్ద ఫ్లోటింగ్ జెట్టీ నిర్మాణం వల్ల సుమారు 4వేల మత్స్యకార కుటుంబాల్లోని 20 వేలమందికి మేలు జరుగుతుంది. జిల్లాలో గుర్తించిన 711 మోటరైజ్‌డ్ ఫిషింగ్ బోట్లు, 417 సంప్రదాయ పడవలు ఉన్నాయి. ఒక్క చింతపల్లి ప్రాంతంలోనే 487 మోటరైజ్‌డ్ ఫిషింగ్ క్రాఫ్ట్, 361 సంప్రదాయ పిషింగ్ బోట్లు ఉన్నాయి. రాష్ట్రంలో పూడిమడక తరువాత, చింతపల్లే రెండో పెద్ద ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌గా చెప్పవచ్చు. ఇక్కడ జెట్టీ నిర్మాణం వల్ల మత్స్యకారులు నిర్భయంగా సముద్రంలోకి వెళ్లే అవకాశం లభిస్తుంది. రాత్రీ పగలూ చేపల వేటకు వెళ్లొచ్చు. మత్స్యకారులు తాము వేటాడిన చేపలను సులువుగా ఒడ్డుకు చేర్చడానికి వీలు అవుతుంది. మేలైన మత్స్య ఉత్పత్తులు ప్రజలకు సరఫరా అవుతాయి. తుఫాన్లు లాంటి సమయంలో జెట్టీ వల్ల మత్స్యకారుల పడవలకు రక్షణ లభిస్తుంది. లంగరు వేసుకోవడం సులువు అవుతుంది.

మత్స్యకారుల ప్రాణాలకు రక్షణ

సముద్ర తీరం నుంచి కెరటాలను దాటుకొని సముద్రంలోకి ప్రవేశించడం అత్యంత ప్రమాదకరమైన ప్రక్రియ. అందుకే కెరటాలు దాటి వెళ్లడం పునర్జన్మతో పోలుస్తారు. ఈ సమయం లోనే ఎక్కువమంది మత్స్యకారులు ప్రమాద వశాత్తూ ప్రాణాలు కోల్పోతుంటారు. దీనికి భయపడి చాలామంది మత్స్యకారులు తమ వృత్తిని వదిలిపెట్టడం లేదా, జెట్టీ ఉన్న ప్రాంతానికి వలస వెళ్లిపోవడం జరుగుతోంది. విజయనగరం జిల్లాలో చేపలవేటలో అత్యంత నైపుణ్యం ఉన్న మత్స్యకారులు ఉన్నారు. వీరి నైపుణ్యానికి గొప్ప గుర్తింపు ఉంది. దేశంలో ఏ రాష్ట్రంలోకి వెళ్లినా, విజయనగరం జిల్లాకు చెందిన మత్స్యకారులు కనిపిస్తారు. విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో పనిచేస్తున్న బోటు డ్రైవర్లలో సగం మంది విజయనగరం జిల్లాకు చెందినవారే కావడం గమనార్హం. జెట్టీ నిర్మాణం వల్ల వీరంతా తమ ప్రాంతాలకు తిరిగివచ్చి, ఇక్కడే తమ కులవృత్తిని నిర్వహించు కొనే అవకాశం లభిస్తుంది.

పర్యాటకపరంగా అభివృద్ధి

చింతపల్లిలో జెట్టీ నిర్మాణం జరిగితే, పర్యాటక పరంగా ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుంది. ఇప్పటికే చింతపల్లి బీచ్ జిల్లాలో ఏకైక సముద్రతీర సందర్శనీయ ప్రాంతంగా ఉంది. ఇక్కడి కొండ సుమారు ఐదు కిలోమీటర్ల మేర సముద్రంలోకి పొడుచుకుపోయి ఉంటుంది. ఈ ప్రాంతంలో వందేళ్ల క్రితం మునిగిపోయిన పడవ అవశేషాలు ఇప్పటికీ కనబడతాయని మత్స్యకారులు చెబుతారు. పర్యాటక ప్రదేశంగా ఈ కొండ ప్రాంతాన్ని అభివద్ది చేయవచ్చు. స్కూబా డైవింగ్ కు కూడా ఈ ప్రాంతం అనుకూలంగా ఉంటుంది. భోగాపురం విమానాశ్రయానికి దగ్గర ప్రాంతం కావడంతో, జాతీయ రహదారి కూడా సమీపంలోనే ఉండటంతో, పర్యాటకంగా చింతపల్లి బీచ్‌కు గొప్ప భవిష్యత్తు ఉందని చెప్పవచ్చు.

మత్స్యకారుల బతుకులు మారతాయి

జిల్లాలో ఫ్లోటింగ్ జెట్టీ నిర్మాణం నిజంగా అద్భుతమైన ఆలోచన. ఈ జెట్టీ నిర్మాణం వల్ల మత్స్యకారుల బతుకులు మారతాయి. మా ప్రాణాలకు రక్షణ లభిస్తుంది. ఉపాధి అవకాశాలు ఎన్నోరెట్లు పెరుగుతాయి. దశలవారీగా ఇక్కడ ఫిషింగ్ హార్బర్‌ను నిర్మిస్తే, మరింత ప్రయోజనం చేకూరుతుంది.

బర్రి చిన్నప్పన్న, జిల్లా మత్స్యకార సహకార సొసైటీ అధ్యక్షులు, ఫిష్ కోపెడ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్



విద్యార్థులను అభినందిస్తున్న కోలగట్ల వీరభద్రస్వామి

జెఇఇ మెయిన్స్ ర్యాంకర్లకు కోలగట్ల అభినందన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెఇఇ మెయిన్స్- 2023, ఇంటర్ లో ప్రతిభ చూపి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అభినందించారు. స్థానిక ప్రదీప్ నగర్లో గల ఎస్ఎస్‌పి కళాశాల విద్యార్థులు జెఇఇ మెయిన్స్‌లో ఆలిండియా స్థాయిలో వెయ్యి లోపు రెండు ర్యాంకులను (213, 914) సాధించారు. మొత్తం పదిమంది విద్యార్థులు అర్హత సాధించారు. సీనియర్ ఇంటర్‌లో అత్యధికంగా 982, జూనియర్ ఇంటర్ లో 464 మార్కులను కళాశాల విద్యార్థులు సాధించారు. ఈ సందర్భంగా ఆదివారం కోలగట్లను వారంతా మర్యాదపూర్వకంగా కలిశారు. భవిష్యత్తులో మరింత బాగా చదివి జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆయన సూచించారు. కళాశాలను ప్రారంభించిన మొదటి సంవత్సరంలోనే తమ విద్యార్థులు ఈ ఘనతను సాధించారని డైరెక్టర్ బూర్లె రవికుమార్ వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సిపి నాయకులు సతీష్ పాల్గొన్నారు.

నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శిగా శ్రీనివాసరావు

ప్రజాశకి-విజయనగరం టౌన్

ప్రభుత్వ 4వ తరగతి ఉద్యోగుల సంఘం భవనంలో జిల్లా అధ్యక్షులు ముువ్వల గంగా ప్రసాదరావు అధ్యక్షతన ఆదివారం జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. రాష్ట్ర కార్యదర్శి పి.చంద్రశేఖర్ రాజు ప్రవర్తన సంఘం నియమావళికి విరుద్ధంగా ఉన్న కారణంగా ఆయనను పదవి నుంచి తొలగించి చందక శ్రీనివాసరావును కార్యదర్శిగా ఎంపిక చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.చంద్రశేఖర్ రవి యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.శ్రీనివాసరావు సమక్షంలో కో - ఆప్షన్ ద్వారా శ్రీనివాసరావును కార్యదర్శిగా నియమించారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి పి.రామలక్ష్మి, ఉపాధ్యక్షులు ఎం శ్రీను, జిల్లా సహాయ కార్యదర్శి శ్రీమతి డి.పైడితల్లమ్మ, ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.సూరిబాబు, ఎస్.అప్పలనరసయ్య, పట్టణ అధ్యక్షులు ఎం.మంగరాజు పట్టణ కార్యదర్శి గంగి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుకాసురులకు అధికారుల అండ

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని పలు గెడ్డలు, వాగుల్లో ఇసుకను తవ్వి కొంత మంది రాత్రి పూట తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అయినా అధికారులు పట్టించుకోకపోగా వారికి కొమ్ము కాస్తున్నట్లు తెలుస్తోంది. రానున్న వర్షాకాలంలో ఈ గోతులు పూర్తిగా వర్షపు నీటితో నిండిపోతే అటువైపు ఎవరు వెళ్లినా ప్రాణాపాయమే. ఈ విషయంపై మైనింగ్ శాఖకు ఫిర్యాదులు చేసిన వారి పేర్లను తిరిగి అధికారులు అక్రమ రవాణాదారులకు చెప్పడంతో వారు ఫిర్యాదుదారులను వేధిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుకాసురుల ఆగడాలకు అడ్డుకట్టు వేసి ప్రభుత్వానికి ఆదాయం వచ్చే విధంగా తగు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

మేడే స్ఫూర్తితో విశాల ఉద్యమాలు : ప్రజా సంఘాల నాయకులు



డాన్సు చేస్తున్న ప్రజాసంఘాలనాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కార్మిక దీక్షదినం మేడే నేపథ్యంలో గురజాడ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సాంస్కతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విఆర్ఎల సంఘం నాయకులు గురుమూర్తి కవాళి, అంగన్వాడీ కార్యకర్త సత్యవతి విప్లవ గీతాలకు నృత్యాలు, విశ్రాంత ఉపాధ్యాయుడు తిరుపతి నాయుడు గుఱ్ఱం జాషువా పద్యాలను రాగయుక్తంగా ఆలపించారు. శ్రీ శ్రీ జయంతి రోజు కావడంతో చిత్ర పటానికి పూలమాలలు వేసి మహా ప్రస్థానం లోని గీతాలను ఆలపించారు. చిన్నారుల పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. స్థానిక ఎన్‌జిఒ హోంలో జరిగిన కార్యక్రమంలో గురజాడ విజ్ఞాన కేంద్రం కన్వీనర్ కె.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, ఎల్ఐసి యునియన్ నాయకులు శ్రీనివాస్, ప్రజా సంఘాలు నాయకులు తమ్మినేని సూర్య నారాయణ, టివి రమణ, ఎ.జగన్మోహన్ , వి.రాములు, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న చీకటి దివాకర్, ప్రొఫెసర్ ఉదయ్‌కిరణ్ తదితరులు

నాలుగు రెక్కల పిట్ట పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి -విజయనగరం కోట

ప్రముఖ కవి లంగా సాంబమూర్తి రచించిన నాలుగు రెక్కల పెట్ట అనే పుస్తకాన్ని ఆదివారం స్థానిక గురజాడ నివాసంలో ఆవిష్కరించారు. శ్రీ శ్రీ జయంతి సందర్భంగా సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భం గా సాహితీ స్రవంతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చీకటి దివాకర్ మాట్లాడుతూ గురజాడ వేసిన అభ్యుదయ బాటను మరింత ఆచరించాలని అన్నారు. సమాజానికి వెలుగుబాట చూపిన గురజాడ ఆయన రచనలు భావి తరానికి దిక్సూచని అన్నారు. తెలుగు ప్రొఫెసర్ ఉదయ్ కిరణ్ ఈ పుస్తకాన్ని సభకు పరిచయం చేశారు. ప్రముఖ యువ కవి బాల సుధాకర మౌళి నాలుగు రెక్కల పెట్ట కవితలను సమగ్రంగా విశ్లేషించి కవి ప్రతిభను ప్రశంసించారు. ఉత్తరాంధ్ర ప్రముఖ కవి కంచరానా జంగారావు, పాయల మురళి ఆప్త వాక్యాలను అందజేశారు. కార్యక్రమంలో చీకటి చంద్రిక రాణి, శ్యామల, మణి, పద్మ, కష్ణవేణి, జిఎస్.చలం, బాలకష్ణ, జీవి. శ్రీనివాస్, టి . సూర్యనారాయణ, సుభద్ర దేవి అనేకమంది కవులు రచయితలు, సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

సిఎం కప్ పోటీలకు విద్యార్థులు

ప్రజాశక్తి-కొత్తవలస

మే ఒకటో తేదీ నుంచి 5వ తేదీ వరకు తిరుపతిలో జగనున్న సిఎం కప్ టోర్న మెంట్‌కు కొత్తవలస నుంచి విద్యార్థులు సెలెక్ట్ అయ్యారని పీడీ కృష్ణరాజు ఆదివారం తెలి పారు. విజయనగరం జిల్లా టీమ్‌కు దెందేరు హైస్కూల్ నుంచి పూర్వ విద్యార్థులు విరోతు నీరజ, అప్పన్నపాలెం గ్రామం నుంచి చిప్పాడ సాయిలత పోటీలో పాల్గొంటారన్నారు. వీరు వాలీబాల్ కోచ్ జి సూరిబాబు దగ్గర శిక్షణ పొందారని గుర్తు చేశారు. మీరు ఎంపిక పట్ల కొత్తవలస వాలీబాల్ సీనియర్ క్రీడాకారులు బాలకృష్ణ, రాజునాయుడు, శ్రీను, జి. మహేంద్ర, వాలీబాల్ ఏఎస్ఎస్ఎన్ కొత్తవలస క్లబ్ సెక్రటరీ గొరపల్లి శివ అభినందనలు తెలిపారు.

జీవనోపాధులతో ఆర్థిక వృద్ధే లక్ష్యం

మెప్మా పీడీ సుధాకరరావు



ప్రజాశక్తి-విజయనగరంటౌన్

పొదుపు సంఘాల్లో ఉన్న మహిళలకు జీవనోపాధులు కల్పించి తద్వారా వారు ఆర్థికంగా అభివృద్ధి చెందడమే లక్ష్యంగా పట్టణ పేదిరిక నిర్మూలన సంస్థ కృషి చేస్తోందని మెప్మా పీడీ బి.సుధాకరరావు తెలిపారు. మెప్మా ద్వారా మహిళలకు అందిస్తున్న పథకాలు, చేపడుతున్న కార్యక్రమాలు గురించి ప్రజాశక్తికి ముఖాముఖి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన వివరించారు.

మెప్మా ఆధ్వర్యంలో ఎన్ని పొదుపు సంఘాలు గ్రూపులు ఉన్నాయి, సభ్యులెందరు? గూపుల లక్ష్యమేమిటి?

విజయనగరం జిల్లాలో విజయనగరం, బొబ్బిలి, నెల్లిమర్ల, రాజాం మున్సిపాల్టీలో మెప్మా ఆధ్వర్యంలో 8173 పొదుపు సంఘాలు ఉన్నాయి. వాటిలో 85825 మంది సభ్యులు ఉన్నారు. ప్రధానంగా పంచ సూత్రాలను పొ దుపు సంఘాలు తప్పకుండా పాటించాల్సి ఉంది. వాటిలో ప్రతినెలా రూ.50నుంచి రూ.100 వరకు పొదుపు చేయడం, క్రమం తప్పకుండా మూడుస్థాయిల్లో పొదుపు సంఘాలు, స్లమ్ లెవెల్ ఫెడరేషన్, టౌన్ లెవెల్ ఫెడరేషన్‌లు ప్రతి నెలా సమావేశం పెట్టి సభ్యులు మాట్లాడుకోవడం, అంతర్గత అప్పులు ఇచ్చి పుచ్చుకోవడం, తీసుకున్న అప్పులను సక్రమంగా చెల్లించడం, సామాజిక అవగాహన సూత్రాలు పాటించడం వంటి పనులు చేయాలి. వీటిని పాటించడం ద్వారా పొదుపు సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావడంతోపాటు, వ్యక్తిగత ఆర్థికవృద్ధి సాధ్యమవుతుంది.

జిల్లాలో పొదుపు సంఘాల ద్వారా పొదుపు పరిస్థితి ఏవిధంగా ఉంది? ఎంత వరకు పొదుపు చేశారు?

8173 పొదుపు సంఘాల ద్వారా ఇప్పటి వరకు రూ.106.06 కోట్లు పొదుపు చేశారు. స్లమ్ లెవెల్ ఫెడరేషన్ నుంచి రూ.15.73 కోట్లు,టౌన్ లెవెల్ ఫెడరేషన్ నుంచి రూ.103లక్షలు పొదుపు చేశారు.

పొదుపు సంఘాల ద్వారా ఎంత ఆర్థిక లావాదేవీలు జరుగుతున్నాయి?


నాలుగు మున్సిపాల్టీలో అంతర్గత అప్పులు, బ్యాంకుల ద్వారా లావాదేవీలు రూ.436.21 కోట్లు టర్నోవర్ జరుగుతున్నాయి. పొదుపు సంఘాలు పరపతి సంతృప్తి స్థాయిలో ఉంది.

వైఎస్ఆర్ చేయూత ఎన్ని విడతలు డబ్బులు వచ్చాయి. ఈ ఏడాది ఎంత మంది ఖాతాల్లో జమ చేశారు.?

వైఎస్ఆర్ చేయూత కింద నాలుగు విడతల్లో ప్రభుత్వం పొదుపు మహిళల ఖాతాల్లో రూ.18,750 చొప్పున జమ చేస్తామని చెప్పింది. ఇప్పటి వరకు మూడు విడతలు విడుదల చేసింది. మూడో విడత గత ఏడాది 18194 మందికి రూ.34.09 కోట్లు విడుదల చేశారు.

జగనన్నతోడు, ఆత్మ నిర్బర పథకం ఎంత వరకు అమలు జరుగుతోంది, ఎంత మంది చిరు వ్యాపారులకు తోడ్పాటునందించారు?

నాలుగు మున్సిపాల్టీలో జగనన్న తోడు పథకం కింద చిరు వ్యాపారులను గుర్తించి 10567 మందికి పది వేలు రూపాయలు చొప్పున అందించాం. దీని మీద కట్టాల్సిన వడ్డీ ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం చిరు వ్యాపారులకు పెట్టిన ఆత్మ నిర్భర భారత్ అనే పథకం ద్వారా నాలుగు మున్సిపాల్టీలో 6469 మందికి ఆర్థిక అందజేస్తున్నాం. దీని ద్వారా మూడు విడతల్లో రూ.10వేలు, రూ.20వేలు, రూ.30వేలు చొప్పున్న మూడు విడతల్లో ఇచ్చాం. వడ్డి రాయితీ కేంద్రమే భరిస్తుంది.



వైఎస్ఆర్ ఆసరా ఎన్ని విడతలుగా చెల్లించారు?

వైఎస్ఆర్ పథకం ద్వారా ఎంత అయితే బ్యాంకులకు అప్పు చెల్లించాల్సి ఉందో దానిని విడతలు వారీగా చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. అందులో భాగంగా నాలుగు విడతల్లో ఇస్తామన్నా డబ్బులు ఇప్పటికి మూడు విడుతలు విడుదల చేసింది. ఇప్పటి మూడు విడతల్లో 5405 సంఘాలకు రూ.37.88 కోట్లు అప్పులు తీర్చింది. మూడోవిడతలో పడాల్సిన డబ్బులు కొద్ది రోజుల్లో పూర్తిస్థాయిలో గ్రూపులకు చెల్లిస్తాం. కార్పోరేషన్‌ల ద్వారా చెల్లింపులు కారణంగా కొంత అలస్యమైంది.

సున్నావడ్డీ ఏ మేరకు అమలు జరుగుతుంది? ఎంత మొత్తం చెల్లించారు?

ఏడాదిలో సున్నా వడ్డీ ఒకటి లేదా, రెండు విడతల్లో ప్రభుత్వం ఇస్తుంది. ఇప్పటి వరకు 6804 సంఘాలకు రూ.10.73 కోట్లు విడుదలైంది.

బ్యాంక్ లింకేజిలు ఏ మేరకు జరుగుతున్నాయి?

బ్యాంక్ లింకేజీలు ఈఏడాది లక్ష్యం 2560 సంఘాలకు రూ.110.40 కోట్లు. అయితే లక్ష్యం కంటే 3592 సంఘాలకు రూ.250.40 కోట్లు బ్యాంక్ లింకేజి ద్వారా ఇచ్చాం.

వ్యక్తిగత రుణాలు ఏ స్థాయిలో ఇచ్చారు, ఎంత మందికి ?

194 మందికి రూ.1.90 కోట్లు వ్యక్తిగత రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా 448 మందికి రూ.4.14 కోట్లు ఇచ్చాం.

ఎపి టిడ్కో ఇళ్లకు ఎంత వరకు బ్యాంకులు ద్వారా ఆర్థికక సహాయం చేశారు?

టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు నాలుగు మున్సిపాల్టీల్లో 2103 మంది అర్హులకు రూ.58.79 కోట్లు విడుదల చేసింది.

జీవనోపాధికి సంబందించిన పథకాలకు ఎంత వరకు ఆర్థిక సహకారాన్ని అందించారు?

వివిధ రకాలు వృత్తులు, వ్యాపారాలు చేసుకునేందుకు 58,961 మందికి రూ.225.36 కోట్లు ఆర్థిక సాయం అందించాం. తద్వారా కూరగాయలు, చెప్పులు షాపుల, పాల ఉత్పత్తులు, డెయిరీ ఫారాలు, చేతి వృత్తులు, పేపరు ప్లేట్ల తయారీ, ఆవులు కొనుగోలు చేసి పాలు వ్యాపారం వంటివి చేసుకునేందుకు ఆర్థిక సాయం అందిస్తున్నాం. వారంతా ప్రతి నెలా సరాసరి రూ.7534 ఆదాయం తెచ్చుకుంటున్నారు.



గోతులమయమైన రహదారి ఇదే..

ప్రమాదకరంగా రహదారి

బొబ్బిలి : బొబ్బిలి నుంచి రామభద్రపురం వెళ్లే రహదారి మధ్యలో గల గొర్ల సీతారాంపురం గ్రామం వద్ద కళ్యాణ వెంకటేశ్వర స్వామి గుడి సమీపంలో రహదారి పూర్తిగా పాడైపోయి చాలా ప్రమాదకరంగా ఉంది. ఇదే రూట్‌లో అనేకమంది వాహన చోదకులు రాకపోకలు సాగిస్తుంటారు. చాలా మంది అధికారులు, నాయకులు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. వారి దృష్టిలో పడినప్పటికీ స్పందన లేదు. ఇక్కడ ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టం జరిగితే గాని చర్యలు తీసుకోరా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. తక్షణమే సంబంధించిన అధికారులు చర్యలు తీసుకుని రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని కాంగ్రెస్ కమిటీ మెంబరు ముప్పల శ్రీనివాసరావుతో పాటు ప్రయాణికులు కోరుతున్నారు.

పగలే వెన్నెల ..

వేపాడ : మండల కేంద్రంలోని వల్లంపూడిలో ప్రధాన వీధుల్లో వీధిలైట్లు ఉదయం నుంచి సాయంత్రం వరకు వెలుగుతున్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో విద్యుత్తు వృధా అవుతుందని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పగటి పూట వెలుగుతున్న వీధి దీపాలను ఆపివేయాలని కోరుతున్నారు.

బైరెడ్డితో అవనాపు భేటి



సిద్ధార్థరెడ్డితో మాట్లాడుతున్న విక్రమ్

విజయనగరం టౌన్ : ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ చైర్మెన్, వైసిపి యూత్ వింగ్ అధ్యక్షులు బైరెడ్డి సిద్దార్థరెడ్డిని అనకాపల్లిలో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామ రాజు జిల్లాల యువజన విభాగం జోనల్ ఇన్చార్జ్ అవనాపు విక్రమ్ ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. పెందుర్తిలో యువజన విభాగం నిర్వహించే ఓ కార్యక్రమానికి హాజరయ్యే ముందు వీరి భేటీ జరిగింది. పార్టీలో యువజన విభాగాన్ని బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. వారితో పాటు మన్యం జిల్లా వైసిపి యూత్ ప్రెసిడెంట్ రంగముద్రి నరేంద్ర, అల్లూరి సీతారామరాజు జిల్లా యూత్ ప్రెసిడెంట్ బి.కిరణ్, యువజన నాయకులు ఉన్నారు. అనంతరం పెందుర్తి శాసన సభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్‌ను విక్రమ్ రాంపురంలో మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా అదీప్ రాజుకు శాలువాకప్పి సత్కరించారు. ఈ సమావేశంలో అవనాపు విక్రమ్‌తో పాటు పార్వతీపురం మన్యం జిల్లా వైసిపి యూత్ ప్రెసిడెంట్ నరేంద్ర,అల్లూరి సీతారామరాజు జిల్లా యూత్ ప్రెసిడెంట్ కిరణ్ ఉన్నారు.

కన్యకాపరమేశ్వరిని దర్శించుకున్న కోలగట్ల

విజయనగరం టౌన్ : నగరంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని శాసనసభ ఉప సభాపతి, ఆలయ గౌరవ అధ్యక్షులు కోలగట్ల వీరభద్ర స్వామి ఆదివారం ఆ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, దేవస్థానం అధికారులు పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం కోలగట్ల కలశ పూజ, హోమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కుమ్మర గంటి శ్రీనివాసరావు, ఆలయ ప్రతినిధులు మాట్లాడుతూ.. అమ్మవారి జన్మదినం సందర్భంగా వేకువ జాము నుంచే విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 108 కలశాలతో అభిషేకాలు, కుంకుమార్చనలు, ఊంజల్ సేవ, మహా హారతి అనంతరం సాయంత్రం తిరువీధి ఉత్సవం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో దేవస్థానం ప్రతినిధులు కట్టమూరి మురుగన్, వెంకటరావు, నర్సింగరావు పాల్గొన్నారు.

వైభవంగా వాసవీమాత జయంతి

విజయనగరం టౌన్: వైశాఖమాస శుక్లపక్ష దశమి శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా 3 రోజులు జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు దేవాలయం కమిటీ అధ్యక్షుడు నారాయణం శ్రీనివాస్ తెలిపారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కుమ్మరిగుంట శ్రీనివాసరావు మాట్లాడుతూ దేవాలయం గౌరవ అధ్యక్షులు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి గారు సలహాలు సూచనలతో మూడురోజుల పాటు అమ్మవారి జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆదివారం అమ్మవారి జయంతి సందర్భంగా ఉదయం 5 గంటల నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. శత కలశాభిషేక మహోత్సవాలు, సాయంత్రం 6 గంటలకు 102 గోత్రాలు కలిగిన అమ్మవారికి 102 రకాలు నైవేద్యాలు సమర్పించి, తిరువీధుల్లో అమ్మవారిని వేద పండితులు సమక్షంలో ఊరేగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వెత్స సత్యన్నారాయణ, కార్యదర్శి గుప్తా, కోశాధికారి విజ్జపు వెంకట శ్రీనివాసరావు, వాసవీక్లబ్ అధ్యక్షుడు కందుల సంతోష్, పాల్గొన్నారు.

నేడు, రేపు పైడితల్లమ్మ పండగ



పైడితల్లమ్మతల్లి

వేపాడ : మండలంలోని జగ్గయ్యపేట గ్రామ దేవత పైడితల్లమ్మ పండగను సోమ, మంగళవారాల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం తొలేళ్ల ఉత్సవం, మంగళవారం అనుపోత్సవాన్ని నిర్వహించనున్నారని ఆదివారం గ్రామంలో చాటింపు వేశారు. ఈ రెండు రోజులు రాత్రి పూట అమ్మవారి ఘటాలు ఊరేగింపు కార్యక్రమం ఉంటుంది. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు, కాంగో నృత్య ప్రదర్శనలు, మహిళా కోలాటం, బండి ప్రభ, బల్ల వేషాలు, మందు గుండు సామాగ్రి కాల్పులతో అమ్మవారి అనుపోత్సవం ఘనంగా నిర్వహిస్తామని సర్పంచ్ వంటాకు సన్యాసమ్మ, ఉప సర్పంచ్ వంటాకు శ్రీను తెలిపారు.



తోరణాలు కడుతున్న కార్మికులు

మేడేకు ముమ్మర ఏర్పాట్లు

బొబ్బిలి : వందలాది మంది కార్మికుల ప్రాణ త్యాగంతో 8 గంటల పని దినం సాధించుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న మేడే వేడుకలకు బొబ్బిలి సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఎర్రని తోరణాలతో వేధిక వద్ద ఏర్పాట్లును ఆదివారం మున్సిపల్ కార్మికులు జి. వాసు, ఎం. ప్రసాద్, ఎం. శంకర్రావు, మురళి ఆద్వర్యంలో చేపట్టారు

3న రెడ్డి శ్రీరామ్మూర్తి వర్ధంతి

కలెక్టరేట్: సిపిఎం జిల్లా కార్యదర్శిగా పనిచేసి కరోనాతో మృతి చెందిన రెడ్డి శ్రీరామ్మూర్తి ద్వితీయ వర్ధంతి మే 3న బెలగాం సెంటర్లో గల గిరిజన సామాజిక భవనంలో జరుగుతుందని ఈ సభను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు తెలిపారు. ఈ మేరకు ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో వర్ధంతి సభ కరపత్రం, పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు రెడ్డి శ్రీదేవి, బంటు దాసు, గొర్లి వెంకటరమణ, వి.ఇందిర, పి.రాజశేఖర్ పాల్గొన్నారు.

అర్ధాంతరంగా నిలిచిన భవన నిర్మాణాలు

- కొన్ని చోట్ల పనులు పూర్తయినా ప్రారంభానికి నోచుకొని వైనం
- అద్దె భవనాల్లోనే విధులు నిర్వహిస్తున్న సచివాలయ సిబ్బంది

ప్రజాశక్తి - వంగర

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ఆరోగ్య ఉపకేంద్రాలు (హెల్త్ సెంటర్లు) నూతన భవన నిర్మాణాలు పనులు చాలా గ్రామాలలో అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఇప్పటికే రెండేళ్లుగా అద్దె భవనాలలో ఇరుకు గదులల్లో విధులు నిర్వహిస్తూ ఇబ్బందులు పడుతున్న సచివాలయ ఉద్యోగులు, కార్యాలయ పనులు కోసం వచ్చి వెళ్తున్న ప్రజలు భవన సదుపాయాలు లేక అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలని, నిర్మాణాలు పూర్తయిన భవనాలను ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

మండలంలోని మొత్తం 29 పంచాయతీలకు గాను, వివిధ గ్రామాలకు సంబంధించి 19 సచివాలయాలు, మరో 19 రైతు భరోసా కేంద్రాలు, 18 ఆరోగ్య ఉప కేంద్రాలు ఉన్నాయి. వీటన్నిటికీ నూతన భవన నిర్మాణాలు మంజూరయ్యాయి. అయితే సచివాలయ వ్యవస్థ ఏర్పడి రెండేళ్లు గడిచినప్పటికీ కూడా చాలా గ్రామాలలో ప్రభుత్వ నూతన భవన నిర్మాణ పనులు పూర్తికాక అర్ధాంతరంగానే ఉన్నాయి. మండలంలోని తలగాం, మగ్గూరు, సంగాం, కొప్పరవలస, కె. సిహెచ్ పల్లి గ్రామాలలో సచివాలయ నూతన భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. కానీ అవి కూడా ప్రారంభం కాలేదు. ఇంకా ఎప్పుడు ప్రారంభిస్తారా అని ఎదురుచూస్తున్నారు.



మండల కేంద్రంలో పునాదుల్లోనే నిలిచిపోయిన సచివాలయ నిర్మాణ పనులు

మధ్యలో నిలిచిన భవనాలు

మండలంలోని ఎం సీతారాంపురం, మద్దివలస, శివ్వాం, కొప్పర, అరసాడ, భాగం పేట తదితర గ్రామాలలో నూతనంగా నిర్మాణాలు చేపట్టిన సచివాలయ భవన నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. అయితే వీటన్నింటికి కూడా కాంట్రాక్టర్లకు ప్రభుత్వం నుండి బిల్లులు చెల్లింపులు లేక భవన నిర్మాణ పనులు నిలిచిపోయినట్లుగా తెలుస్తుంది.

పనులే ప్రారంభం కాని భవనాలివే..

సచివాలయ నూతన భవన నిర్మాణాలకు సంబంధించి మండలంలోని వి.వి.ఆర్‌పేట, శ్రీహరిపురం గ్రామాలలో నిర్మించవలసిన సచివాలయ భవన నిర్మాణ పనులు నేటికీ ప్రారంభం కాలేదు. ఈ గ్రామాల్లో స్థల సమస్య ఉన్నట్లు తెలిస్తోంది. దీంతో ప్రస్తుతం సచివాలయం అద్దె కొంపలోనే ఇరుకు గదుల్లో నిర్వహిస్తున్నారు.

ఇవి ఇలా ఉండగా... మద్దువలస, వంగర గ్రామాలలో సచివాలయ నూతన భవన నిర్మాణ పనులు ప్రారంభంలో గబగబా పునాదులు వేసినప్పటికీ ఈ రెండు సచివాలయ నూతన భవన నిర్మాణాలకు సంబంధించి స్థల సమస్య కోర్టుకి వెళ్లినట్లుగా తెలుస్తుంది. అందువల్ల ఈ రెండు సచివాలయాల నూతన భవనిర్మాణ పనులు అక్కడితో నిలిచిపోయాయి. వీటికి సంబంధించిన పనులు మరలా ఎప్పుడు ప్రారంభిస్తారో తెలియని పరిస్థితి. ఇక రైతు భరోసా కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాలకు సంబంధించి మండలంలోని కొన్నిచోట్ల నూతన భవన నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. మరికొన్నిచోట్ల పూర్తయినప్పటికీ ప్రారంభానికి నోచుకోని పరిస్థితి.

అద్దె భవనాలలో ఇబ్బందులు

ప్రభుత్వం రెండేళ్ల క్రితం సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసినప్పుడు నుంచి అందులో పని చేస్తున్న ఉద్యోగులు అద్దె భవనాల్లో విధులు నిర్వహిస్తున్నారు. ఇరుకు గదులు, సిగ్నల్ సమస్య, వెలుతురు లేకపోవడం, మహిళా ఉద్యోగులకు మరుగుదొడ్ల సమస్య వంటివి వారిని వెంటాడుతున్నాయి. ప్రభుత్వానికి కూడా అద్దె చెల్లింపుల భారం పడుతుంది. అందువల్ల ఇటు ఉద్యోగులు, అటు ప్రజలు ఇబ్బందులను ఇప్పటికైనా అధికారులు దృష్టిలో పెట్టుకుని మధ్యలో నిలిచిపోయిన భవన నిర్మాణాలను వేగవంతం చేయాలని ఇప్పటికే పూర్తయిన భవనాలకు బిల్లులు చెల్లించి ప్రారంభించాలని కోరతున్నారు.



సీతారాంపురంలో నిలిచిపోయిన సచివాలయ, ఆర్‌బికె భవన సముదాయం

నిర్మాణ పనులు నెమ్మదిగా సాగుతున్నాయి..


వివిధ గ్రామాలలో చేపడుతున్న సచివాలయ, రైతు భరోసా కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలు నూతన భవన నిర్మాణ పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. కొన్నిచోట్ల భవన నిర్మాణ పనులు పూర్తయినప్పటికీ ఎప్పుడు ప్రారంభిస్తారు అనేది మేము చెప్పలేం.

కే ఆనందరావు, పంచాయితీ రాజ్ జె.ఇ, వంగర

విద్యార్థి దశ నుంచే నైతిక విలువలు

ప్రజాశక్తి- చీపురుపల్లి

విద్యార్థి దశ నుంచే నైతిక విలువలు నేర్చుకోవాలని ఆశయ సంస్థ అధ్యక్షులు రెడ్డి రమణ అన్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఆదివారం ఆయన పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఇంటి వద్దకే పుస్తకం పంపిణీ కార్యక్రమాం ద్వారా ఎవరైనా పుస్తకం కావాలంటే తనకు ఫోన్ చేస్తే వారి ఇంటి దగ్గరకు వెళ్లి పుస్తకాలు ఇస్తామన్నారు. వేసవి సెలవుల్లో విద్యార్థులకు కథలు పుస్తకాలపై పోటీలు నిర్వహించి అందులో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. విద్యార్థుల ఇంటి దగ్గరకు వెళ్లి పుస్తకం ఎంతవరకు చదువుకున్నారో కథలు పోటీలు నిర్వహిస్తామని అని తద్వారా చిన్న తనం నుండి పుస్తకాలు చదవడం అలవాటు చేయడం అవుతుందని చెప్పారు. పుస్తకాలు చదవడం వల్ల ఏకాగ్రత పెరుగుతోందన్నారు. కుదురుగా ఒక దగ్గర కూర్చునే అలవాటు లేని వాళ్ళు సైతం బుక్ రీడింగ్ అలవాటు చేసుకుంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు భారతీ, ఉపాధ్యాయులు వసుంధ శోధన, వాలంటీర్, విద్యార్థులు పాల్గొన్నారు.



చీపురుపల్లి: విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న రమణ

విద్యార్థుల పట్ల శ్రద్ధ చూపించాలి

డెంకాడ: వేసవి సెలవుల్లో తల్లిదండ్రులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని మండలంలోని పినతాడివాడ ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం రామారావు చెప్పారు. పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో 'ఉయ్ లవ్ రీడింగ్ సమ్మర్ యాక్టివిటీస్ కెరియర్ గైడెన్స్' పై విద్యార్థుల శ్రద్ధ వహించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. ఈ పాఠశాల నుంచి 8వ తరగతికి వెళ్తున్న విద్యార్థులు ట్యాబ్‌లోని వీడియోలు ద్వారా సృజనాత్మకతను పెంపొందించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులను, పాఠశాలలో సాధించిన మెడల్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



డెంకాడ: విద్యార్థులకు మెడల్స్‌ను అందిస్తున్న హెచ్ఎం

మధ్యాహ్న భోజనం పరిశీలన

వంగర : స్థానిక మండల కేంద్రం ప్రాథమిక పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని ఎంఇఒ వై. దుర్గారావు ఆదివారం పరిశీలించారు. అన్ని రుచికరంగా ఉండటంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయాన్ని వృధా చేయకుండా ఉపాధ్యాయులు ఇచ్చిన హోంవర్కును చక్కగా చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు వి. గోవిందరావు పాల్గొన్నారు.

ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

నెల్లిమర్ల : ఇంటర్ పరీక్షా ఫలితాల్లో ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు సికెఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సత్య నారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ప్రకటించిన ఇంటర్ పరీక్షల ఫలితాల్లో ఫెయిలైన సికెఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సోమవారం నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12.30 వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామన్నారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫెయిలైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కొత్తవలస: ఇంటర్‌లో ఉత్తీర్ణత సాధించలేని విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహించనున్నట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. భీమ శంకర్ రావు తెలిపారు. మే 1 నుండి 20వ తేదీ వరకు శిక్షణా తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు తరగతులను నిర్వహిస్తామన్నారు. ఈ సధవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అద్దె భవనాల్లోనే అంగన్‌వాడీలు

వేపాడ : మండలంలోని అత్యధికంగా అంగనవాడీ కేంద్రాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. వైసిపి అధికారంలోకి వచ్చి నాలుగేళ్లవుతున్నా ఇప్పటికీ పూర్తి స్థాయిలో అంగన్‌వాడీ కేంద్రాలకు శాశ్వత భవనాలు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. ఉన్న భవనాలకు రంగులు వేయడం తప్పా కొత్త భవనాలను నిర్మించిన పరిస్థితి లేదు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం అద్దె భవనాలు స్థానంలో కొత్త అంగన్వాడీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు కోరుతున్నారు.



అద్దె కొంపలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ భవనం

గృహ ప్రవేశాలు జరిగేనా..?

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని వల్లంపూడి జగనన్న కాలనీలో నిర్మాణాలు నత్త నడకన సాగుతున్నాయి. దీంతో గృహ ప్రవేశాలు జరిగేనా అన్న సందేహం వ్యక్తమవుతోంది. ఈ గ్రామంలో 26 మందికి ఇంటి స్థలాలు కేటాయించారు. అయితే నిర్మాణ సామగ్రి ధరలు పెరిగిపోవడంతో లబ్ధిదారులు ముందుకు రావడం లేదు. ప్రభుత్వ సాయం కూడా చాలకపోవడంతో వెనుకడుగు వేస్తున్నారు. కాగా లే అవుట్‌కు మెటీరియల్ తెచ్చుకునే సౌకర్యం కూడా లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. పలుమార్లు ఈ సమస్యను హౌసింగ్ డే సమావేశాలలో అధికారులకు తెలిపినప్పటికీ ఏ విధమైన చర్యలూ చేపట్టలేదని లబ్ధిదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని లబ్ధిదారులు కోరుతున్నారు.



నిర్మాణ దశలో ఉన్న జగనన్న కాలనీ

దళిత పోరాట కథ '1818 దీర్ఘ కవిత'

ప్రజాశక్తి- రాజాం

1818 సంవత్సరంలో మహారాష్ట్రలోని దళితులు అప్పటి పీష్వాల మీద పోరాటం చేసి గెలిచిన కథయే '1818 దీర్ఘ కవిత' అని ప్రముఖ సాహితీవేత్త, రచయిత పిల్లా తిరుపతిరావు అన్నారు. స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో ఆదివారం జరిగిన రాజాం రచయితల వేదిక 99వ సమావేశంలో పుప్పాల శ్రీరామ్ రచించిన '1818 దీర్ఘ కవిత - పరిశీలన' అనే అంశంపై తిరుపతి రావు ముఖ్య ప్రసంగం చేశారు. ఆధిపత్య వర్గాలకు చెందిన పీష్వాలు తమను అణచివేస్తున్నందున దళితులు భీమానది ఒడ్డున గల కోరెగావ్ ప్రాంతంలో ఎదిరించి ఓడించిన కథ అని దీనిని 73 పుటల దీర్ఘ కవితగా శ్రీరామ్ రచించారని తిరుపతి రావు వివరించారు. ఇది ఒకే కథకు చెందిన పెద్ద కవిత అయినప్పటికీ కవితాత్మకంగా, ఆకర్షణీయంగా, చరిత్రకు అనుగుణంగా శ్రీరామ్ రచించారని రంగం నాధం మాస్టారు చెప్పారు. ఈ సందర్భంగా తిరుపతి రావును వేదిక సభ్యులు ఘనంగా సన్మానించారు. సాహితీ వేత్త నల్ల రవికుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వేదిక నిర్వాహకుడు గార రంగనాథం, ఒమ్మి రమణమూర్తి, పెంకి దయానిధి నాయుడు, రాంబారికి రవితేజ, ఆల్తి మోహన్‌రావు, నేతేటి గణేశ్వర రావు, సమతం మహేశ్వరరావు, తురంగి విశ్వనాథం, రాజాపు శాంతారావు, పొట్నూరు కోటి బాబు, పొదిలాపు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రంగనాథం మాస్టారు

శిష్టకరణాల అభివృద్ధికి సహకారం

ప్రజాశక్తి- రామభద్రపురం, విజయనగరం కోట

శిష్టకరణాల అభివృద్ధికి సంపూర్ణ సహకారాలు అందిస్తామని జిల్లా అధ్యక్షులు ఎంపి గౌరీశ్వరరావు తెలిపారు. స్థానిక అమర్ భవనంలో ఆదివారం జిల్లా శిష్టకరణ సంఘం ఎన్నికలు జరిగాయి. జిల్లా అధ్యక్షులుగా గౌరీశ్వరరావు ఎన్నికయ్యారు. కోశాధికారిగా వాండ్రంగి వెంకటేష్ వెంకటేష్, ఉపాధ్యక్షులుగా ప్రభాత్ పట్నాయక్, గౌరవ అధ్యక్షులుగా ఆర్. ఆనంద పట్నాయక్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బగ్గం సుధాకర్ రావు, సహాయ కార్యదర్శులుగా కుప్పిలి ప్రవీణ్‌వర్ధన్ ఎటివి ప్రసాద్, పి.మోహనరావు, సలహా కార్యదర్శులుగా ఆరికతోట తిరుపతి రావు, బోగిల శ్రీనివాసరావు, డబ్బీరు నాగరాజు తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన సభ్యులంతా ఎవరికైనా ఎటువంటి ఆర్థిక సహాయం చేయాలన్న ముందంజలో ఉంటారన్నారు. ప్రధాన కార్యదర్శి రేగ సురేష్ మాట్లాడుతూ తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. శిష్టకరణ కులాన్ని ఒబిసిలో చేర్పించేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. రాష్ట్ర అధ్యక్షులు పోలు మహంతి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ శిష్టకరణ కులాన్ని ఒబిసిలో చేర్చాలని కోరుతూ త్వరలో ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ఒక కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తామన్నారు.



కమిటీ వివరాలను వెల్లడిస్తున్న అధ్యక్ష, కార్యదర్శులు

ఆక్రమణదారులపై కానరాని చర్యలు

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండలంలోని రంగారాయపురం (అగ్రహారం) పంచాయతీలో ఉన్న రామలింగేశ్వరస్వామి ఆలయానికి చెందిన దేవదాయ ధర్మాదాయ శాఖ భూములు ఆక్రమణదారులపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా నిమ్మకున్నారు. 'ఆలయ భూములు హాంఫట్ ' అనే శీర్షికతో గత నెల 10న ప్రజాశక్తిలో ప్రచురణమైన కథనానికి స్పందించి ఎండోమెంట్ అధికారులు ఆ భూములను పరిశీలించారు. రెవెన్యూ సర్వేనెంబర్ 9/4 లో ఎకరా 19 సెంట్లు దేవదాయ శాఖకు చెందిందేనని ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ పీవీ లక్ష్మి అప్పట్లో తెలిపారు. అదే సర్వే నంబర్‌లో గల 14 సెంట్లు విస్తీర్ణంలో షాపింగ్ కాంప్లెక్స్ నిమిత్తం పిల్లా కృష్ణారావు కడుతున్న భవన నిర్మాణ పనులనూ అడ్డుకున్నారు. ఎండోమెంట్ అధికారులు చెప్పిన ఎకరా 19 సెంట్లు ఎండోమెంట్ భూమిలో చాలా మేరకు గృహాలు, రెస్టారెంట్ వంటివి నిర్మించారు. క్షేత్ర స్థాయి పరిశీలన చేసినట్లు హడావుడి చేసిన అధికారులు ఇప్పటి వరకూ ఆక్రమణదారులపై ఎటువంటి చర్యలూ తీసుకోలేదు సరి కదా. ఉన్న భూమిలోని కూడా ఏ విధమైన హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం శోచనీయం. ఇప్పటికైనా ఎండోమెంట్, రెవెన్యూ అధికారులు స్పందించి అక్రమ నిర్మాణదారులపై చర్యలు తీసుకుని దేవాదాయ శాఖ భూమిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

రాష్ట్రంలో నియంత పాలన

మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్

ప్రజాశక్తి- రేగిడి

వైసిపి ప్రభుత్వం నాలుగేళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమం గాలికి వదిలిసిందని మాజీ మంత్రి, టిడిపి రాజాం నియోజకవర్గ ఇంఛార్జి కోండ్రు మురళీమోహన్ అన్నారు. ఆదివారం అంబకండి గ్రామంలో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలను ప్రభుత్వ పనితీరు ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. పథకాలు కొంతమందికే అందుతున్నాయని, అర్హులకు అందలేదని మాజీ మంత్రి కోండ్రుకు ప్రజలు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి కేటాయించిన నిధులను వైసిపి ప్రభుత్వం దారి మళ్లించడంతో గ్రామాలు అభివృద్ధికి నోచుకోక కుంటిపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో నిత్యావసర ధరలు పెరుగుదలతో ప్రజలు అల్లాడిపోతున్నారన్నారు. ఇసుక మాఫియాతో వైసిపి నాయకులు కోట్లు సొమ్ము వెనకేసుకుంటున్నారని విమర్శించారు. రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు నష్టపోతున్నారన్నారు. దేశంలోనే ఎక్కువగా అప్పులు బాధలతో ఆంధ్రప్రదేశ్‌లో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆరోపించారు సిఎం జగన్ మోహన్ రెడ్డి తన అనాలోచిత నిర్ణయాలతో నియంత పాలనను కొనసాగిస్తూ మౌళిక సదుపాయాలు లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తయారు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు మంచిరోజులు వస్తాయన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా టిడిపి అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కిమిడి అశోక్, మాజీ జెడ్‌పిటిసి ఉషారాణి, డిసిసిబి మాజీ అధ్యక్షులు దూబ ధర్మారావు, సర్పంచ్ శాసపు గోవిందరావు, సత్యం నాయుడు, గురావాన నారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్

హత్య కేసు దర్యాప్తు ముమ్మరం

రామభద్రపురం: ఇటీవల మండలంలో సంచలనం సృష్టించిన తూర్పు గోదావరి జిల్లా వాసి సాగి వెంకట రమణ దారుణ హత్య కేసు దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. ఆదివారం బొబ్బిలి సిఐ తిరుమలరావు, స్థానిక ఎస్ఐ సురేంద్ర నాయుడు ఘటనా స్థలం పరిశీలించారు. ఇప్పటికే క్లూస్ టీం, పోలీస్ జాగిలాలతో క్షుణ్ణంగా తనికీలు నిర్వహించారు. మృతుని కుటుంబ సభ్యులు చెప్పిన సమాచారం మేరకు వృత్తి రీత్యా తాపీ మేస్త్రి అయిన వెంకటరమణ స్వగ్రామం నుంచి వైజాగ్ వెళుతున్నట్లు ఇంట్లో చెప్పి వైజాగ్‌లో అప్పుగా నగదు తీసుకొని వస్తాను అన్నట్లు సమాచారం. అయితే వైజాగ్ నుంచి ఇక్కడకి ఎందుకు వచ్చాడు? ఎవరితో వచ్చాడు? ఇక్కడ హత్య చేశారా? అనే ప్రశ్నలకు సమాధానాలు ఇంకా దొరక లేదు. పోలీసులు మాత్రం కేసు పురోగతికి సిబ్బందితో సమాలోచనలు, శాస్త్రీయ పద్ధతులతో విశ్లేషణ చేస్తున్నారు. ఒకటి రెండు రోజుల్లో నిందితులు పట్టు బడే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తుంది. ఏది ఏమైనా ప్రశాంత మండలంలో దారుణ హత్యా కాండ పై భయాందోనలు వ్యక్తమవుతున్నాయి.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సిఐ, ఎస్ఐలు